సాక్షి
సూర్యాపేట
సోమవారం । 31 । జూలై । 2023



హరియాణా గ్యాంగ్ పనేనా?

అయిటిపాములలోని ఏటీఎంలో జరిగిన చోరీ హరియాణా గ్యాంగ్ పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు.

- 8లో



నృసింహుడి నిత్యకల్యాణం

మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు.

- 10లో

గరిష్టం/కనిష్టం
30° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సూర్యాపేట ఆర్డీఓగా వీరబ్రహ్మచారి



మంత్రికి పూల మొక్కను అందజేస్తున్న ఆర్డీఓ వీరబ్రహ్మచారి

సూర్యాపేట రూరల్: సూర్యాపేట నూతన ఆర్డీఓగా కె.వీరబ్రహ్మచారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం సూర్యాపేటలో మంత్రి జగదీష్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. అనంతరం నూతన ఆర్డీఓకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నిక



జిల్లా నూతన కమిటీ సభ్యులు

సూర్యాపేట టౌన్: తెలంగాణ సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లానూతన కమిటీని ఆదివా రం సూర్యాపేటలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాంపంగు వెంకటేశ్వర్లు(సీఆర్‌పీ-మునగాల), ప్రధాన కార్యదర్శిగా కె.వెంకటరమణ(ఎస్‌ఓ కేజీబీవీ- నడిగూడెం), కోశాధికారిగా కె.లక్ష్మీనారాయణ(డీపీఓ సూర్యాపేట), ఉపాధ్యక్షులుగాజి.రవికుమార్(ఐఈఆర్‌పీ-మోతె), బి.రాంబాబు(ఎమ్మార్సీ- మునగాల), ఎస్.శ్రీదేవి(కేజీబీవీ-మోతె), సహాయ కార్యదర్శిగా విజయలక్ష్మి(జీహెచ్-మునగాల) లతో పాటు మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సీహెచ్.రామలింగారెడ్డి పాల్గొన్నారు.

మూడు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో అధికారులు మూడు క్రస్ట్ గేట్లు పైకెత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఆదివారం సాయంత్రం వరకు మూసీకి ఎగువ ప్రాంతాల నుంచి 6,839 క్యూసెక్కుల నీరు వస్తుండగా మూడు క్రస్ట్‌గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి 5,556 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46టీఎంసీలు) కాగా 642 అడుగుల (3.69 టీఎంసీల) మేర నీరు ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టుకు 515 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు మొత్తం 6,081 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.



దిగువకు పోతున్న నీరు

33,545 మందికి రాలే!

ఐదెకరాలు పైబడిన రైతులకు అందని 'రైతుబంధు'

- ముమ్మరంగా వానాకాలం సీజన్ పనులు
- రెండు నెలలుగా పెట్టుబడి సాయానికి నిరీక్షణ



నాగారం: ఏటా సాగు సీజన్ ప్రారంభంలోనే ప్రభుత్వం రైతులకు రైతు బంధు పథకం కింద పెట్టుబడి సాయం చేస్తూ వస్తోంది. ఈ సారి వానాకాలం సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా జిల్లావ్యాప్తంగా 33,545మంది రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. ఇప్పటివరకు ఐదెకరాల లోపు సాగు భూమి కలిగిన రైతులకే వారి ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమచేశారు. కానీ, ఐదెకరాలు పైబడి రైతులకు నేటికీ జమకాకపోవడంతో ఎప్పుడు పడతాయోయనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఐదెకరాలలోపు వారికే..

జిల్లాలో 2,89,256 మంది రైతులు మొత్తం 6,11,177 ఎకరాల విస్తీర్ణంలో వరి, పత్తి, కంది, పెసర ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుబంధు పథకం రైతులకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం జూన్ 26వ తేదీ నుంచి ప్రారంభించింది. మొదటి రోజు ఎకరం భూమి ఉన్న వారికి, రెండో రోజు రెండెకరాలకు ఇలా.. పెట్టుబడి సహాయాన్ని జమ చేశారు. ప్రస్తుతం ఐదెకరాలలోపు ఉన్న వారికి మాత్రమే రైతుబంధు నగదు జమయ్యాయి. ఆపైన ఉన్నవారికి ఇంకా జమకాలేదు.

ఎంతమందికి వచ్చిందంటే..

జిల్లాలో 2,89,256 మంది రైతులు ఉండగా వీరి బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయంగా మొత్తం రూ.317.37 కోట్ల నగదు జమకావాల్సి ఉంది. ఇప్పటి వరకు 2,55,711 మంది రైతులకు రూ.233.46కోట్ల నగదు వారివారి ఖాతాల్లో జమ అయ్యాయి. ఇంకా 33,545 మంది రైతులకు రూ.83.91 కోట్ల నగదు జమ కావాల్సి ఉంది. నగదు అందని వారు ప్రతిరోజూ బ్యాంకుల వద్దకు వెళ్లి ఖాతాలో నగదు పడిందా లేదా అని అడిగి తెలుసుకొని నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఎవరూ ఆందోళన చెందొద్దు



"రైతుబంధు పథకం కింద నమోదైన రైతులందరికీ విడతల వారీగా పెట్టుబడి సాయం జమవుతుంది. ఇటీవల కొత్తగా నమోదు చేసుకున్న వారి వివరాలు సైతం ప్రభుత్వానికి అందించాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొత్తగా నమోదైన వారందరితోపాటు పెద్ద రైతులందరికీ పెట్టుబడి సాయం అందుతుంది.

– రామారావు నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సూర్యాపేట

సాగు ఖర్చులకు తప్పని ఇబ్బందులు

ప్రస్తుత సీజన్‌లో ఆలస్యంగా వర్షాలు కురవడంతో పంటల సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దీంతో దున్నకం ఖర్చులు, ఎరువుల కొనుగోలు, కలుపు మందుల పిచికారీ పనులకు నగదు అవసరం కాగా రైతులకు చేతిలో చిల్లిగవ్వ లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రైతులు అప్పులు చేసి పెట్టుబడికి డబ్బులు తెచ్చుకుంటున్నారు. కొందరికే రైతు బంధు నగదు జమ చేయడం న్యాయం కాదని, తమకు కూడా పెట్టుబడి సాయం అందించాలని ఐదెకరాలు పైబడిన రైతులు కోరుతున్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): శాకాహారం తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ఉన్నత వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేటలోని జమ్మిగడ్డలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ సూర్యాపేట-పిరమిడ్ స్పిరిచ్చువల్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన మెగా శాకాహార ర్యాలీని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని అహింసాయుత దేశంగా మార్చడానికి బ్రహ్మర్షి పత్రీజీ నేతత్వంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. శాకాహారం ఆయుష్షును పెంచతుందని, కూరగాయల్లో ఫైబర్, పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ శరీరానికి కావాల్సిన మోతాదులో ఉంటాయన్నారు. అందుకే శాకాహారానికి అలవాటు పడితే బరువు తగ్గుతారని తెలి పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నేత ఇమ్మడి సోమనర్సయ్య, ఉప్పల ఆనంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టు కొండ సత్యనారాయణ, తోట శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో క్రైస్తవులకు రక్షణ కల్పించాలి



మన్నా చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

భానుపురి (సూర్యాపేట): మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టి రక్షణ కల్పించాలని జిల్లా ఐక్య పాస్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆదివారం సూర్యాపేట పట్టణంలోని వివిధ చర్చిల్లో జాతీయ పతాకాలు, కొవ్వొత్తులు పట్టుకొని కన్నీటి ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులను హింసించడం మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చిల పాస్టర్లు, సంఘ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో 60 మంది విద్యార్థినులకు కళ్ల కలక

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ బీసీ బాలికల గురుకులంలో కళ్ల కలక కలకలం రేపుతోంది. పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉండగా రెండు రోజులుగా దాదాపు 60 మంది కళ్ల కలక బారిన పడ్డారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ అనితను సంప్రదించగా కళ్ల కలక వచ్చిన విద్యార్థులకు నర్సు ద్వారా చికిత్స అందిస్తున్నామని చెప్పారు. కళ్ల కలక తగ్గని విద్యార్థులను వారి ఇళ్లకు పంపుతున్నామని పేర్కొన్నారు.

హోంగార్డులను రెగ్యులరైజ్ చేయాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న హోంగార్డులు

సూర్యాపేట: రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సేవలు అందిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన హోంగార్డులు కోరారు. ఈ మేరకు ఆదివారం సూర్యాపేటలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో హామీ ఇచ్చినప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ విషయాన్ని మరలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మాకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు లింగా నాయక్, మల్లారెడ్డి, యాదగిరి, రఘు, నాగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను నేటితరానికి తెలియజేస్తాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఆగస్టు 2న బొల్లగాని పుల్లయ్య వర్ధంతిని మొదలుకొని 18న సర్వాయి పాపన్న 373వ జయంతి వరకు అమరుల యాదిలో పేరుతో జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న సామాజిక చైతన్య యాత్ర పోస్టర్‌ను తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎలుగూరి గోవింద్, మడ్డి అంజిబాబు మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు, వారు చేసిన పోరాటాలు మరుమలేనివని, వారి త్యాగాలను నేటి తరానికి తెలియజేస్తామని పేర్కొన్నారు. కల్లుగీత వృత్తిలో ఉపాధి -ప్రత్యామ్నాయ మార్గాలను ఊరూరా ప్రచారం చేస్తూ ప్రజల్లో సామాజిక చైతన్యం కల్పిస్తామన్నారు. 20 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్టుగానే ఈ సారికూడా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కల్లు గీత సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్బగాని భిక్షం, గుణగంటి కృష్ణ, కొండ అన్నపూర్ణ, జిల్లా సహాయ కార్యదర్శి ఉయ్యాల నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో 'యూపీఐ'



యూపీఐ సేవల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ మహేందర్‌రెడ్డి తదితరులు

- అందుబాటులోకి రానున్న ఫోన్‌పే, గూగుల్‌పే సేవలు
- ఉమ్మడి జిల్లాలోని 31 బ్రాంచీల్లో నేటి నుంచి అమలు
- 2,300 కోట్ల రూపాయలకు చేరుకున్న డీసీసీబీ టర్నోవర్

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) సేవలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు కేవలం కమర్షియల్ బ్యాంకుల్లో మాత్రమే అందుబాటులో ఉన్న యూపీఐ సౌకర్యాన్ని ఇక నుంచి డీసీసీబీ పరిధిలోని అన్ని బ్రాంచీల్లో అందుబాటులోకి రానుంది. ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఇతరులకు డబ్బులు పంపించడంతో పాటు తమ ఖాతాల్లో నుంచి ఇతరులు డబ్బులు జమచేసే సౌకర్యం ఉంటుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుతో పాటు దాని పరిధిలో ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 31 బ్రాంచీల్లోని ఖాతాదారులకు సోమవారం నుంచి యూపీఐ సేవలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,76,500 మంది ఖాతాదారులకు సేవలను అందించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మొత్తం ఖాతాదారుల నుంచి లక్షా 60 వేల మంది ఖాతాదారులు నిత్యం బ్యాంకుల నుంచి లావాదేవీలు నిర్వహిస్తున్నారు. యూపీఐ యాప్‌కు సంబంధించిన బ్రోచర్‌ను డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు.

రూ.2300 కోట్ల టర్నోవర్..

డీసీసీబీ ప్రస్తుత పాలకవర్గం బాధ్యతలు స్వీకరించే నాటికి రూ.900 కోట్ల టర్నోవర్ ఉండగా.. ఇప్పుడు రూ.2300 కోట్ల టర్నోవర్‌కు చేరుకుని రూ.75 కోట్ల లాభాలతో ముందుకు సాగుతోంది. ఎన్‌పీఏ శాతం కూడా 2.03 శాతంగా తగ్గింది. ప్రస్తుతం సహకార సంఘాలు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల అమ్మకాలు చేయడంతో పాటు పెట్రోల్ బంకులను సైతం నిర్వహించి మంచి లాభాలను గడిస్తున్నాయి. ఇప్పుడు యూపీఐ సేవల వల్ల బ్యాంకు ఖాతాదారుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. యూపీఐ సేవలపై తమ ఖాతాదారులందరిలో అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఖాతాదారుడిని బ్యాంకు వద్దకు పిలిపించుకుని వారికి యూపీఐ సేవలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకు మేనేజర్లను చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. డిపాజిట్ల సేకరణ, ఖాతాదారులకు మెరుగైన సేవలు, రుణాలను అందించడంలో కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలి

యూపీఐ సేవలను ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న డీసీసీబీ ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలి. తమ పరిధిలో ఉన్న బ్రాంచీలకు వెళ్లి యూపీఐ కోసం దరఖాస్తు సమర్పించి సేవలను వినియోగించుకోవాలి. కొత్త ఖాతాలను, కరెంట్ అకౌంట్లను మరింత పెంచే దిశగా చర్యలు తీసుకోవాలి. అధికారులు, పాలకవర్గ సభ్యులు, ఖాతాదారుల సమిష్టి కృషితో ప్రస్తుతం డీసీసీబీ మంచి లాబాల్లో ఉంది.

– గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

'తొలిమెట్టు'పై మళ్లీ శిక్షణ

- ప్రభుత్వ పాఠశాలల్లో సులభతర బోధనకు కార్యాచరణ
- గతేడాది సత్ఫలితాల సాధనతో కొనసాగిస్తున్న విద్యాశాఖ
- తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులపై తర్ఫీదు
- ఆగస్టు 2 నుంచి 8వ వరకు విడతల వారీగా టీచర్లకు తరగతులు



ఉపాధ్యాయలకు వచ్చిన నూతన పుస్తకాలు

జిల్లాలో మండలాలు	23
పీఎస్, యూపీఎస్‌లు	722
మొత్తం విద్యార్థులు	31,000
శిక్షణ పొందే టీచర్లు	1,800

చిలుకూరు: విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గతేడాది చేపట్టి తొలిమెట్టు కార్యక్రమం సత్ఫలితాలు సాధించింది. దీంతో ఈ కార్యక్రమాన్ని ఈ విద్యాసంవత్సరంలో కూడా కొనసాగించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఆగస్టు మొదటి వారంలో తొలిమెట్టుపై మళ్లీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. వచ్చేనెల 2, 3 తేదీల్లో తెలుగు, 4, 5 తేదీల్లో గణితం, 7, 8 తేదీల్లో ఇంగ్లిష్ సజెక్టులపై శిక్షణ ఇచ్చేందుకు విద్యా శాఖ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.

ఒక్కో మండలానికి ఆరుగురు ఆర్పీలు..

రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్ల (ఆర్పీల)తో టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు ఒక్కో మండలానికి ఆరుగురు చొప్పున జిల్లాలోని 23 మండలాలకు 138 మంది రిసోర్స్ పర్సన్లను కేటాయించారు. శిక్షణలో విద్యార్థులకు సులభంగా బొమ్మల రూపంలో పాఠాలు బోధించడం తదితర అంశాలతో పాటు ఉపాధ్యాయులకు నూతనంగా వచ్చిన హ్యాండ్‌బుక్స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. రోజువారి బోధన ప్రణాళికలు, పీరియడ్స్ ప్రణాళికలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం)పై శిక్షణ ఉంటుంది. తరగతి గదిలో 45 నిమిషాలు బోధన, 45 నిమిషాలు అభ్యాసన కృత్యాల సాధన చేయించాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి విద్యార్థులకు కూడా వర్క్‌బుక్స్ వచ్చాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఉపాధ్యాయులకు వచ్చే నెల 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు శిక్షణ ఇస్తాం. శిక్షణకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. శిక్షణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్స్, విద్యార్థులకు వర్క్‌బుక్స్ వచ్చాయి. తెలుగు, ఇంగ్లిష్, గణితం సజెక్టులపై శిక్షణ కొనసాగుతుంది.

– దేవరశెట్టి జనార్దన్, జిల్లా సెక్టోరియల్ అధికారి

శిక్షణ ఇచ్చేది వీరికే..

ఒక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉంటే ఇద్దరికి, అదేవిధంగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలో ఒక్కరు చొప్పున శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఉర్దూ ఉపాధ్యాయులు 12 మందికి శిక్షణ పూర్తయింది. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా శిక్షణ అనంతరం వారంలో 5 రోజులు విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన అనంతరం 6వ రోజు విద్యార్థుల చేత మూల్యాంకనం చేయించాల్సి ఉంటుంది. 6 రోజుల పాటు జరిగే శిక్షణను మండల విద్యాధికారి పర్యవేక్షిస్తారు. వర్షాల కారణంగా ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం అయినప్పటి నుంచి పాఠశాలలు సక్రమంగా కొనసాగలేదు. వారం రోజుల నుంచి వర్షాల కారణంగా సెలవులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సెలవులు పూర్తికాగానే స్కూళ్లకు వెళ్లకుండా నేరుగా శిక్షణ కార్యక్రమానికి వెళ్లాల్సి రావడంతో ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కార్మిక గర్జన సభను జయప్రదం చేయాలి



సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుంగతుర్తి: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 4న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన కార్మిక గర్జన సభను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ వేర్పుల కర్ణాకర్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు పేర్ల నాగయ్య కోరారు. ఆదివారం తుంగతుర్తిలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన కేంద్రంలో సభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 20లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని సీఎం కేసీఆర్ గాలికి వదిలేశారన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి, సుధాకర్, రాములు, లింగన్న, సోమయ్య, అచ్చయ్య, మల్లయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు .

జీజేహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుచ్చయ్య



బుచ్చయ్యను సన్మానిస్తున్న సభ్యులు

భానుపురి (సూర్యాపేట): గౌడ జన హక్కుల పోరాట సమితి(జీజేహెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నూతనకల్ మండలం చిల్పకుంట్లకు చెందిన బిక్కి బుచ్చయ్య గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలికట్ట విజయకుమార్ గౌడ్ నియామక పత్రం అందించి సన్మానించారు. జిల్లా అధ్యక్షుడిగా కారింగుల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులుగా జానయ్య గౌడ్, దంతూరి సోమన్న గౌడ్, కోశాధికారిగా టి.అశోక్ గౌడ్‌ను నియమించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ గౌడ్, మడ్డి మహేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ సాయుధ పోరాట యోధుడి మృతి



భిక్షమయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రంగారెడ్డి

వేములపల్లి: మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు శీలం పెద్ద భిక్షమయ్య (89) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితోపాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు భిక్షమయ్య భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్‌ఎస్ మిర్యాలగూడ పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, స్థానిక సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీరామ్‌రెడ్డి, సీపీఎం నాయకులు డబ్బికార్ మల్లేష్, కందుల నాగిరెడ్డి, పోలబోయిన వరలక్ష్మి తదితరులున్నారు.

కోదాడలో మూడు ఇళ్లలో దొంగతనం

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో దుండగులు తెగబడ్డారు. ఒకే రోజు రాత్రి పట్టణంలోని నయానగర్‌లో మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. నయానగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాయిలి గురుస్వామి శనివారం ఇంటికి తాళం వేసి ఖమ్మం వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చేవరకు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 10తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. అదేవిధంగా సుల్తాన్ మొహర్రం పండుగకు రెండు రోజుల కిందట వల్లాపురానికి వెళ్లాడు. వచ్చి చూసే వరకు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారంతో పాటు రూ.50వేల నగదును దొంగిలించారు. ఈ ఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ ప్రకాష్, క్లూస్ టీం సభ్యులు వచ్చి వివరాలు సేకరించి వేలిముద్రలు తీసుకున్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ రెండు సంఘటనలు కాక మరొకరి ఇంట్లో చార్జింగ్ పెట్టిన రెండు సెల్ ఫోన్లను కూడా దుండగులు అపహరించుకుపోయినట్లు బాధితులు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

చౌటుప్పల్ : వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారమని పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు నల్లెంకి వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల పరిధిలోని పీపల్‌పహాడ్‌కు చెందిన పలువురు ఆదివారం చలమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు ఇప్పటికే సిద్ధమయ్యారని, పార్టీకి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్‌ఎస్‌లు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మునుగోడు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల శ్రీహరి, నర్సింహ్మా, చిదుగుళ్ల వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

హరియాణా గ్యాంగ్ పనేనా..?

- అయిటిపాముల ఏటీఎంలో దొంగతనం వారే చేశారని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
- గత డిసెంబర్‌లో నల్లగొండలోని ఎస్‌బీఐ ఏటీఎంలోనూ ఇదే తరహా చోరీ
- ఆ.. కేసులో హరియాణా ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు
- బెయిల్‌పై విడుదలైన ఆ ముఠా సభ్యులే చోరీలకు పాల్పడుతున్నారని అనుమానాలు
- ఇటీవల మరో మూడు చోట్ల చోరీకి విఫలయత్నం



అయిటిపాముల ఏటీఎం వద్ద ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ రాఘవరావు తదితరులు

నల్లగొండ క్రైం : నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాములలోని ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.23లక్షలను అపహరించింది.. హరియాణా గ్యాంగేనా అంటే.. అవుననే పోలీసువర్గాల నుంచి సమాధానం వస్తోంది. ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని ఆధారాలు దొరకకుండా చేతికి గ్లౌజ్‌లు, ముఖానికి మాస్క్‌లు.. గ్యాస్ కట్టర్ సహాయంతో చోరీకి పాల్పడేది అదే గ్యాంగ్ అని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. గత ఏడాది డిసెంబర్ చివరి వారంలో హరియాణా గ్యాంగ్ జిల్లా కేంద్రంలోని బీటీఎస్ ప్రాంతంలో గల ఎస్‌బీఐ ఏటీఎంలో ఇదే తరహాలో రూ.14.28లక్షలను చోరీ చేసిన విషయాన్ని పోలీసువర్గాలు ఉటంకిస్తున్నాయి.

జైలు నుంచి విడుదలై..

నల్లగొండలోని ఏటీఎంలో చోరీకి పాల్పడిన కేసును అప్పట్లో పోలీసులు నెలరోజుల వ్యవధిలోనే ఛేదించారు. చోరీకి పాల్పడిన హరియాణా రాష్ట్రానికి చెందిన నలుగురితో పాటు జిల్లా కేంద్రంలోని పాతబస్తీకి చెందిన ఒకరిని మొత్తం ఐదుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. అయితే, ఆ గ్యాంగ్ సభ్యులు రెండు మాసాల క్రితం బెయిల్‌పై విడుదలై మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల చౌటుప్పల్, చిట్యాల, బీబీనగర్ ప్రాంతాల్లోని ఏటీఎంలలో కూడా ఈ ముఠా సభ్యులే చోరీకి విఫలయత్నం చేసినట్లు అనుమానిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు అయిటిపాముల ఏటీఎంలో చోరీ జరుగుతోందని పోలీసులకు సమాచారం అందిందని, పెట్రోలింగ్ సిబ్బంది 3.10 గంటలకు అక్కడికి చేరుకునే లోపే దుండగులు పసిగట్టి పరారైనట్లు తెలిసింది. పోలీసులు అక్కడికి సకాలంలో చేరుకోకపోతే మరో ఏటీఎంలో ఉన్న రూ.40లక్షలను కూడా దుండగులు అపహరించుకుపోయేవారని పోలీసులు చెబుతున్నారు.

సెన్సార్ లేని ఏటీఎంలే లక్ష్యం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏటీఎంలలో చోరీకి పాల్పడిన కేసుల్లో ఎక్కువగా హరియాణా గ్యాంగ్‌కు చెందిన వారే అరెస్ట్ అయ్యారు. ఈ ముఠా సభ్యులు తొలుత రెక్కీ నిర్వహించిన తర్వాతే చోరీకి పాల్పడుతారని పోలీసులు చెబుతున్నారు. ఈ గ్యాంగ్ పాత ఏటీఎంలనే (సెన్సార్ లేని) లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడుతుందని తెలిసింది. కొత్త వాటిని గ్యాస్ కట్టర్‌తో కట్ చేయబోతే సెన్సార్ ద్వారా పోలీసులు, బ్యాంక్ సిబ్బందితో పాటు థర్డ్‌పార్టీ సిబ్బందికి సమాచారం వెళ్తుంది. అందుకే ఈ గ్యాంగ్ సెన్సార్ లేని ఏటీఎంలనే ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన గ్యాంగ్‌లు జిల్లాలోని ఏటీఎంలలో చోరీకి పాల్పడినప్పటికీ ఆధారాలు లభించకుండా దొంగతనాలు చేయడం హరియాణా గ్యాంగ్‌కు వెన్నతో పెట్టిన విద్య అని తెలుస్తోంది.



ఏటీఎం కేంద్రంలోకి ప్రవేశిస్తున్న దుండగులు

రహస్య ప్రాంతానికి వెళ్లి..

ఐదుగురు సభ్యులు గల ఈ ముఠా చోరీ చేసిన తర్వాత పోలీసుల నుంచి తప్పించుకునేందుకు కారును సిద్ధం చేసుకుని ఉంటారని, డబ్బులు ఒక్కరి వద్దే ఉంచుకోకుండా రహస్య ప్రాంతానికి ప్రాంతానికి వెళ్లి పంచుకుంటారని తెలిసింది. ఈ ముఠా సభ్యులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి.

హరియాణా గ్యాంగ్‌పైనే అనుమానాలు

గతంలో నల్లగొండలో జరిగిన చోరీ తరహాలోనే అయిటిపాముల ఏటీఎంలో దొంగతనం జరిగింది. ఇది హరియాణా గ్యాంగ్ చేసినట్లుగానే భావిస్తున్నాం. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో ఏటీఎంలలో చోరీకి ప్రయత్నం చేసినప్పటికీ వారికి నగదు లభించలేదు. గస్తీ పోలీసులు ఘటనా స్థలానికి సకాలంలో వెళ్లకపోతే మరో ఏటీఎంలో ఉన్న రూ.40లక్షలు చోరీ అయ్యేవి. కీలక ఆధారాలు సేకరించాం. గ్యాంగ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.



నర్సింహారెడ్డి, నల్లగొండ డీఎస్పీ

నిలిచిన నీటిలో పడి వలస కూలీ మృతి



నీటిలో మహేష్ మృతదేహం

ఆత్మకూరు(ఎం): ప్రమాదవశాత్తు పాఠశాల చుట్టూ నిలిచిన నీటిలో పడి ఓ వలస కూలీ మృతిచెందాడు. ఆత్మకూర్(ఎం) మండల పరిధిలోని కామునిగూడెంలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు(ఎం)మండలంలో కూలీల కొరత తీవ్రంగా ఉండటంతో వరినాట్లు వేయడానికి నకిరేకల్ మండలం తాటికల్లు గ్రామం నుంచి సుమారు 30మంది వలస కూలీలు వచ్చారు. వారంతా నెల రోజుల నుంచి కామునిగూడెంలో మూతబడిన పాఠశాలలో ఉంటూ సమీప గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. పది రోజుల నుంచి వర్షంలో తడవడం కారణంగా వలస కూలీల్లో ఒకరైన పాలడుగు మహేష్(22) తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇతడికి మూర్ఛ వ్యాధి కూడా ఉంది. ఆదివారం ఉదయం వరినాట్లు వేయడానికి తోటి కూలీలు వెళ్లిపోగా మహేష్ పాఠశాల వద్దే ఉండిపోయాడు. మహేష్ పాఠశాల మెట్లు దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద నిల్వ ఉన్న నీటి గుంటలో పడిపోయాడు. చాలాసేపటి తర్వాత గ్రామస్తులు గమనించడంతో అప్పటికే మహేష్ మృతిచెందాడు. పాఠశాల మెట్లు దిగుతున్న క్రమంలో ఫిట్స్ రావడంతో నీటిలో పడిపోయి మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి మారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దొమ్మేటి నాగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



రాములు (ఫైల్)



సురేష్ (ఫైల్)

హుజూర్‌నగర్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయి. హుజూర్‌నగర్, భువనగిరి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని మల్లన్ననగర్‌కు చెందిన పాలంపల్లి రాములు (45) దినసరి కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోకి మోటార్ సైకిల్‌పై వస్తున్న ముదిగొండ సురేష్ (22) అదుపుతప్పి అతడిని ఢీకొట్టాడు. ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు. మార్గమధ్యలోనే రాములు మృతి చెందాడు. సురేష్‌ను అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు.

లారీ ఢీకొని..



ఘటనాస్థలంలో క్రాంతికుమార్ మృతదేహం

భువనగిరి : నల్లగొండ జిల్లా చిట్యాలలోని బృందావన్ కాలనీకి చెందిన బత్తుల క్రాంతి కుమార్ (23), పల్లె శివశంకర్ భువనగిరిలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద జరిగిన శుభకార్యానికి ఆదివారం ఉయదం వచ్చారు. శుభకార్యం ముగిసిన అనంతరం తిరిగి బైకుపై చిట్యాలకు బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని నందనం గ్రామానికి చేరుకోగానే భువనగిరి నుంచి చిట్యాల వెళ్తున్న లారీ వెనుక నుంచి బైకును ఢీకొట్టింది. దీంతో క్రాంతి కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా అదే కాలనీకి చెందిన శివకుమార్ తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన శివశంకర్‌ను భువనగిరి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం క్రాంతికుమార్ మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకుని రైతు బలవన్మరణం



యాదగిరి (ఫైల్)



రమేష్ (ఫైల్)

గుర్రంపోడు : ఉరేసుకుని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గుర్రంపోడు మండలంలోని వట్టికోడు గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వట్టికోడు గ్రామానికి చెందిన గుండెబోయిన యాదగిరి(33) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యాదగిరి ఆదివారం ఇంటి వద్ద నుంచి పత్తి చేనుకు గుంటక తోలేందుకు వెళ్లి మధ్యాహ్నం సమయంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. యాదగిరి చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో పరిసర రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తన భర్త ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని, విచారణ జరిపి న్యాయం చేయాలని భార్య స్వప్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యతో గొడవపడి...

మాడుగులపల్లి : భార్యతో గొడవపడి క్షణికావేశంలో పురుగుల మందు తాగి భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. మాడుగులపల్లి మండలంలోని కన్నెకల్లు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. కన్నెకల్లు గ్రామానికి చెందిన ఇరుగంటి రమేష్ (26) స్థానికంగా ఓ రైతు వద్ద పనిచేస్తూ భార్యా పిల్లలతో కలిసి ఉంటున్నాడు. శనివారం భార్య దివ్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తాను పనిచేసే వ్యక్తి చేనులోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం హుటాహుటిన సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. మృతుడికి మూడేళ్ల కుమార్తె, ఆరు నెలల కుమారుడు ఉన్నారు. రమేష్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో స్నేహంగా మెలిగే వ్యక్తి ఇలా ఆత్మహత్యకు పాల్పడడం గ్రామస్తులను కలచివేసింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

భూ వివాదంలో ఇద్దరిపై కేసు

రామగిరి(నల్లగొండ): భూ వివాదంలో ఇద్దరిపై ఆదివారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పర్తి మండలం గోదోరిగూడేనికి చెందిన గోద వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాగర్‌రెడ్డిల మధ్య కొంత కాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం గోద రవీందర్‌రెడ్డిపై సోదరులు శేఖర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి దాడి చేశారు. రవీందర్‌రెడ్డి తలకు బలమైన గాయమైంది. వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

హెల్త్ సబ్ సెంటర్‌కు కేంద్ర బృందం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పిలాయిపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆదివారం నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ బృందం సందర్శించింది. ఆస్పత్రిలో రికార్డులు, వసతులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వ్యాధి నిరోధక చర్యల గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద, మండల వైద్యాధికారులు యాదగిరి, శ్రీవాణి, పిలాయిపల్లి ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్ సందీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ ప్రతినిధులు

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో చోరీ





ఆలయంలో దుండగులు తెరిచిన బీరువా, హుండీ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు భువనగిరి మండలం నమాత్‌పల్లి గ్రామ పరిధిలో గల శ్రీ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోజు మాదిరిగా ఆదివారం ఉదయం 7గంటల సమయంలో సిబ్బంది ఆలయానికి వెళ్లారు. అప్పటికే ఆలయ ప్రధాన ద్వారాల తాళం తీసి ఉండటాన్ని గమనించి కమిటీ చైర్మన్, డైరెక్టర్లకు సమాచారం అందించారు. వారు ఆలయానికి చేరుకుని పరిశీలించిన అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దుండగులు శనివారం రాత్రి ఆలయంలోని బీరువాకు వేసి ఉన్న తాళాలను పగులగొట్టి అందులో ఉన్న అభిషేకం, అర్చన టికెట్స్ డబ్బులు రూ. 12,660 నగదుతో పాటు హుండీలోని కానుకలను అపహరించుకుపోయారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు



సమావేశంలో మాట్లాడుతున్న సీత

భువనగిరిటౌన్ : బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఐద్వా యాదాద్రి జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, పీడబ్ల్యూఓ జిల్లా కార్యదర్శి సీత, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ణం పద్మ డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ అల్లర్లపై స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. సభ్య సమాజం తలదించుకునేలా మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగినటువంటి సంఘటన మణిపూర్ రాష్ట్రానికే కాకుండా భారతదేశంలో ఉన్న మహిళా సమాజం మొత్తం కించపరచబడిందని అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కనీసం స్పందన లేకుండా దేశ ప్రధాని మణిపూర్‌లో జరిగిన సంఘటనపై మాట్లాడకుండా మౌనంగా ఉండడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అత్యధికంగా మహిళల మీద దాడులు దౌర్జన్యాలు అత్యాచారాలు హత్యలు అధికంగా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బట్టు రామచంద్రయ్య, బర్రె జహంగీర్, బాల్‌నర్సయ్య, బాలరాజు, మల్లేశం, పుష్ప, నరసింహ, అతహర్, కొడారి వెంకటేష్, శ్రీనివాసచార్యులు, పురుషోత్తంరెడ్డి, మల్లారెడ్డి, రాంబాయి, బండారు రవివర్ధన్, గోవింద్, నాగమణి, అమీద్, గడ్డం వెంకటేష్, ముత్యాలు, వివేకానంద, మాధవి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ప్రభుత్వం

- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరివేర్చిందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఉప సర్పంచ్ దుర్గం మాధురిమశ్చేందర్, కోఆప్షన్ సభ్యులు నూకల అశోక్, దుర్గం దేవేందర్, ముత్యాల మశ్చేందర్, చిల్లర శంకర్, తోటకూర సాయి, కన్నెమోని శంకర్, మహేశ్, సంపత్, మరో 25 మంది, కప్రాయిపల్లికి చెందిన యాదవసంఘం అధ్యక్షుడు కంటె నర్సింహ, నాయకులు కన్నెమోని కిష్టయ్య, అంజయ్య, శ్రీశైలం, గణేశ్‌తో పాటు 50 మంది యాదవ సంఘం నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కుఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లోలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, రైతు సమన్వయసమితి కన్వీనర్ రావుల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శులు చిల్వేరు బాలనర్సింహ; బందారపు లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యాల మహిపాల్‌రెడ్డి, సర్పంచులు దుర్గం స్వప్న నరేశ్, గోదశ్ల ప్రభాకర్‌గౌడ్, ఎంపీటీసీ చిల్లర జంగయ్య, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు రాగీరు సత్యనారాయణ, కన్నెమోని కుమార్, దుర్గం రాజు, దుర్గం శ్రీశైలం, సుంకరి రవికుమార్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి అదనపు కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

భువనగిరిటౌన్ : నూతనంగా నియామకమైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న దీపక్ తివారీ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వీరారెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా నూతన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

లేత వరినారే శ్రేయస్కరం

- నాటు వేయడానికి 3 వారాల ముందు నుంచే పొలం సిద్ధం చేసుకోవాలి
- నారు తలలు తుంచి నాటడం ఉత్తమం
- పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ సూచనలు



వరినారు కట్టలు కడుతున్న కూలీలు

పాడి పంట

పెద్దవూర: ఓ వైపు వర్షాలు కురుస్తుండటం, మరోవైపు బోర్లు, బావులు, చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటం, నాగార్జునసాగర్ ఆయకట్టు కింద రైతులు వరి సాగును అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో వరినారు పెంచడం ఒక ఎత్తు అయితే, నారును జాగ్రత్తగా ప్రధాన పొలానికి తరలించి నాటడం మరో ఎత్తు. నాట్లు వేసే సమయంలో రైతులు ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలనే విషయాలను పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ వివరించారు.

దున్నడమే ప్రధానం

వరినాట్లు వేయాలంటే పొలాన్ని దాదాపు 3వారాల ముందు నుంచే తయారు చేసుకోవాలి. ట్రాక్టర్‌తో, నాగలితో గానీ ఒక సాలు దున్నిన తర్వాత నాలుగైదు రోజులకు మరో సాలు చేయాలి. దీనివలన కలుపు మొక్కలు బురదలో కూరుకుపోయి, పంటకు ఎరువుగా ఉపయోగపడతాయి. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ వేస్తే వాటిని కలియదున్నే సమయంలో 50 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ వేయాలి. దీనివలన పచ్చిరొట్ట ఎరువులు త్వరగా చిలికి, వరి మొక్కలకు ఎరువులను అందిస్తాయి.

దమ్ము చేయాలి

ప్రధాన పొలాన్ని దున్నిన తర్వాత చదును చేసేందుకు ట్రాక్టర్‌తో దమ్ము చేయాలి. దమ్ము బాగా చేస్తే నీటి వృథాను అరికట్టడంతో పాటు, కలుపు కూడా అదుపులో ఉండే అవకాశం ఉంది. సాగు నీరు పెట్టినప్పుడు పొలం అంతటికీ నీరు అందుతుంది. చివరి దుక్కిలోనే ఆయా ప్రాంతాలకు సిఫారసు చేసిన నత్రజని, భాస్వరం, పొటాష్‌ను ఇచ్చే ఎరువులను వేయాలి. రైతులు కాంప్లెక్స్ ఎరువులను వాడదలుచుకుంటే దుక్కిలోనే వేసుకోవాలి. వరిలో పైపాటుగా వేసిన కాంప్లెక్స్ ఎరువులను మొక్కలు సమర్థంగా వినియోగించుకోలేవు. దమ్ములో జింక్, భాస్వరం ఎరువులను ఒకేసారి వేయకుండా 2 నుంచి 3 రోజుల తేడాతో వేసుకోవాలి. అలాగే ప్రధాన పొలం గట్లపై ఉన్న కలుపు మొక్కలను, గడ్డిని తొలగించాలి.

నీటి యాజమాన్యం పాటించాలి

నాట్లు పూర్తయిన తర్వాత పొలంలో 20 రోజుల వరకు స్వల్పంగా అంటే 5 సెంటీమీటర్ల నీరు ఉండాలి. సక్రమ నీటి యాజమాన్యం పాటిస్తే సకాలంలో పిలకలు వచ్చి దిగుబడి బాగుంటుంది. సాగు నీరు స్వల్పంగా ఉంటే సుడిదోమ, లద్దెపురుగు తాకిడి ఎక్కువగా ఉండదు. నాట్లు వేసిన పొలంలో ఎప్పుడూ నీరు ఉండేలా చూసుకోవాలి. నీటి తడి ఆరిపోతే కలుపు మొక్కలు ఎక్కువగా వస్తాయి. రసాయన ఎరువులు వేసేటప్పుడు పొలంలో నీరు స్వల్పంగా ఉండేలా చూసుకోవాలి. నాటిన వారం పది రోజులకు పిలకలు తొడగడం ప్రారంభమై, 50 నుంచి 60 రోజులకు వరి గరిష్ట పిలకల స్థాయికి చేరుకుని మంచి దిగుబడులు వస్తాయి.

ముదురు నారైతే కుదుళ్ల సంఖ్య పెంచుకోవాలి

నాట్లు వేయాలంటే నారు ఆరోగ్యంగా ఉండాలి. 4 నుంచి 6 ఆకులు కలిగిన నారు ప్రధాన పొలంలో నాటు వేసేందుకు అనుకూలం. పొలాన్ని బురద బురదగా తయారు చేసి, అందులో పైపైన 2 నుంచి 3 సెం.మీ.ల లోతులో నాట్లు వేయడం మంచిది. వరి నారును లోతుగా నాట్లు వేస్తే పిలకల సంఖ్య కూడా తగ్గిపోతుంది. కుదురుకు 2 నుంచి 3 మొక్కలు నాటవచ్చు. నాటేటప్పుడు నారు తలలు తుంచి నాటుకోవడం మంచిది. ఎందుకంటే పొడవాటి నారు మొక్కల చివరి ఆకులు వాలిపోయి, బురదకు అంటుకు పోవడం వలన ఆకులను ఆశించే తెగుళ్లు వేగంగా వృద్ధి చెందుతాయి. ఆకులను కత్తిరించకుండా ఉండాలంటే ఆరోగ్యవంతమైన నారును సరైన వయసులో నాటుకోవడం ఉత్తమం. మొక్కలు సమాన దూరంలో ఉంటేనే లాభదాయకం. లేత నారు నాటడం అన్ని విధాలా శ్రేయస్కరం.